ఆఖరి మజిలీ సాఫీగా సాగేలా..



ముస్లిం శ్మశాన వాటిలో నిర్మించిన వెయిటింగ్ హాల్

- రూ.1.98 కోట్లతో కరాస శ్మశాన వాటిక అభివృద్ధి
- హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు తగిన ఏర్పాట్లు
- మత సామరస్యానికి ప్రతీకగా కరాస శ్మశాన వాటిక



కరాసలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటిక ముఖద్వారం

విశాఖ విద్య: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఎన్‌ఏడీ దరి ఓల్డ్ కరాస శ్మశాన వాటిక అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. ఆఖరి మజిలీ సాఫీగా సాగేలా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు వారి సాంప్రదాయాల ప్రకారం దహన సంస్కారాలు చేసుకునేలా వసతులు కల్పిస్తున్నారు. దీంతో శ్మశాన వాటిక ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 52, 57,90 వార్డుల పరిధిలో చనిపోయిన వారిని దహన సంస్కారాలు నిర్వహించేందుకు కరాస శ్మశాన వాటికకు తీసుకొస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాల కల్పనపై గత పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్మశాన వాటికల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది.

రూ.1.98 కోట్లతో పనులు

శ్మశాన వాటికలో అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడానికి రూ.1.98 కోట్లు మంజూరు చేశారు. క్రిస్టియన్ శ్మశాన వాటికలో అధునాతన ప్రేయర్ హాల్, హిందూ శ్మశాన వాటికలో మోడ్రన్ భర్నింగ్ ఫ్లాట్‌పారం, శ్మశాన వాటిక వెనుక ఉన్న గెడ్డను అనుసంధానం చేస్తూ డ్రైన్స్, ప్రాంగణంలో గ్రీనరీ పెంపు వంటి పనులు చేపట్టారు. మత సామరస్యానికి ప్రతీకగా శ్మశాన వాటిక ప్రవేశ మార్గంలో ఆర్చి నిర్మించనున్నారు. హిందూ, ముస్లిం శ్మశాన వాటికలో ఒక్కో చోట రూ.15 లక్షల వ్యయంతో ఇప్పటికే వెయిటింగ్ హాల్స్ నిర్మాణం పూర్తి చేశారు.



శ్మశాన వాటిక ప్రాంగణంలో శివుని విగ్రహం

ప్రజావసరాలకు పెద్దపీట



ప్రజల అవసరాలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ చూపుతుంది. నగర జనాభా పెరుగుతుండడంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా శ్మశాన వాటికలను అభివృద్ధి చేయడం మంచి పరిణామం.

– బీఎస్ కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సంతోషంగా ఉంది



ఏళ్ల తరబడి కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను ఇప్పుడు పరిష్కరిస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మా ప్రాంతం అభివృద్ధి చెందింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ఇన్నాళ్లకు సమస్యలు తీరుతుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఎస్. పద్మ, అంబేడ్కర్ నగర్

అందరి సహకారంతోనే..



ప్రజలు నమ్మకంతో కార్పొరేటర్‌గా అవకాశం కల్పించారు. అందుకే వార్డు ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నాను. అందులో భాగంగానే శ్మశాన వాటిక అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాం .రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, బ్యూటిఫికేషన్ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాను.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

సకాలంలో పనులు పూర్తి

కరాస శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారికి అనుగుణంగా శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తున్నాం. సకాలంలో పనులు పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఏడు కొండలు, డీఈఈ, జీవీఎంసీ, 5వ జోన్

క్లుప్తంగా

సెయింట్ ఆన్స్ స్కూల్లో పొలంబడి



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెంలోని సెయింట్స్ ఆన్స్ పాఠశాలలో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కూరగాయల మొక్కల పెంపకం, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని వక్తలు అన్నారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు పిన్నమనేని శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ బెల్సి జోస్, సిస్టర్ జోసఫిన్, పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో ఉన్న వారికి శుక్రవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా లుపిన్ ఫార్మాసూటికల్ ప్రైవేట్ లిమిటెడ్, స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పట్నం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆశ్రమంలో ఉన్న వారందరికీ గుండె, ఒత్తిడి, రక్తపోటు, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్పొరేటర్ బి. రమణ, హృద్రోగ వైద్య నిపుణులు పి.ఎస్.ఎస్. సుబ్రమణ్య, డాక్టర్ సురేష్, సీఎస్ఆర్ మేనేజర్ వెంకట్, స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమం మేనేజర్ ఎల్లేటి మమత తగిన ఏర్పాట్లు చేశారు.

గుండె ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



హృదయం ఆకారంలో నర్సింగ్ విద్యార్థులు

గోపాలపట్నం: ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బెహరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ దివ్య అన్నారు. గోపాలపట్నం బెహరా ఆస్పత్రిలో శుక్రవారం హృదయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నర్సింగ్ స్కూల్ విద్యార్థులు గుండె ఆకారంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నడుస్తున్నప్పుడు విపరీతంగా అలసిపోవడం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు తరచూ ఉంటే గుండె వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. అలాగే పాదాలు మడమలు ఉబ్బడం, దవడలు నొప్పి వంటివి వస్తే నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్ర ప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 616 ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 230 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 75 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వారికి జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న బాలికలు



బహుమతి గెలుచుకున్న ముగ్గు

మల్కాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మల్కాపురం యాదవ వీధి వద్ద స్థానిక యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన ముగ్గుల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మొత్తం 120 మంది మహిళలు పోటీలో పాల్గొన్నారు. వీరిలో ఉత్తమంగా నిలిచిన ముగ్గులను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. అశ్వినికి తొలి బహుమతి, అక్షరకు రెండో బహుమతి, నమ్మి సాయి రూపకు మూడోవ బహుమతి ప్రకటించారు. వీరికి నిర్వాహకులు నగదు బహుమతులతో పాటు వినాయకుని చిత్రపటాలు ఇచ్చి సత్కరించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ఆలోచనను కేంద్రం వెంటనే ఉప సంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ పిలుపు మేర శుక్రవారం బైక్ ర్యాలీ,నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జింక్ నుంచి మల్కాపురం వరకు జరిగిన బైక్ ర్యాలీలో లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉంటేనే పారిశ్రామిక ప్రాంత ప్రజలకు మనుగడ అని అన్నారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బడా బాబుల చేతుల్లో పెట్టేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. ఈ సమస్యపై పోరాడాల్సిన టీడీపీ, జనసేన పార్టీలు వారికి చెక్క భజన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు,నాయకులు పైడిరాజు,ఆర్.లక్ష్మణమూర్తి,పెంటారావు,ఆర్.విమల తదితరులు పాల్గొన్నారు.



లేబర్ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

స్కూల్‌గేమ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. క్రీడల్లో కూడా ఈ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో జరిగాయి. ఇక్కడ రాణించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపికలు జరిగాయి. ఇందులో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు , జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఎస్తేర్ హెప్సిబా విద్యార్థులను అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాల్



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం హెప్సిబా

గణనాథుడికి పూజలు.. అన్నసమారాధనలు



ప్రకాష్‌నగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న బద్రీనాథ్



అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లోని వినాయక మండపంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ స్వామికి పూజలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని అతిథిగా ఆయన ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి(రాము), పార్టీ నగర కార్యదర్శి పీలా అనంత్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

- ఇదే వార్డు మల్కాపురంలో జరిగిన అన్నసమారాధనను కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. పార్టీ నాయకుడు చట్టి నూకరాజు యాదవ్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.
- 58వ వార్డు పిలకవానిపాలెం సీతారామాలయం వద్ద వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి పూజలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో భక్తులకు ఆమె అన్నప్రసాదం వడ్డించారు.



62వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, ప్రకాష్‌నగర్‌లోని ఏడుగుళ్ల సెంటర్ వద్ద నిర్వహించిన అన్నసమారాధనను ముఖ్య అతిథి కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, 60వ వార్డు సీనియర్ నాయకుడు జి.ఎల్.వి.నరేష్, సచివాలయ కన్వీనర్లు సత్యనారాయణ, రామకృష్ణ, సంతోష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

సింధియా: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. చింతల్లోవ సచివాయ పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, వార్డు వలంటీర్లలతో జగనన్న ఆరోగ్య సురక్షపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ వైద్య సేవలను ప్రజల ముంగిటకే అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండి ఉచిత వైద్య పరీక్షలతో పాటు చికిత్స, మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సోమాదుల సురేష్, వార్డు ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కొట్నాన రవి, ఇతర నాయకులు, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గణపతి చెంత దీపారాధన

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద శుక్రవారం రాత్రి దీపారాధన వేడుకగా జరిగింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీపాలను వెలిగించి ప్రారంభించారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పార్వతీ తనయుడి చెంత భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో జియ్యాని యూత్ నిర్వాహకులు జియ్యాని విజయ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రజల్లోకి విస్తృతంగా 'ఆరోగ్య సురక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న గుణిశెట్టి శ్రీనివాసరావు



యూపీహెచ్‌సీల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీవీఎంసీ ఏఎంవో డాక్టర్ కృష్ణంరాజు



హరిజన వీధిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోపాలపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ 91వ వార్డు నాయకుడు గుణిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సుసుర్ల కాలనీ 471 సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షను ఏవిధంగా విజయవంతం చేశారో.. అదే స్థాయిలో ఈ కార్యక్రమం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. అనంతరం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తారని చెప్పారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 472 సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన 10 రేషన్ కార్డులను లబ్ధిదారులకు గుణిశెట్టి శ్రీనివాసరావు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, నాయకులు దేరెడ్ల స్వతనారాయణ, చుక్క పైడిరాజురెడ్డి, చుక్క అప్పారావు, కృష్ణారెడ్డి, సచివాలయ అడ్మిన్ అనీషా, కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

- అక్టోబర్ 4న చినముషిడివాడ
- 10న చంద్రానగర్ జెడ్పీ హైస్కూల్
- 12న యూపీహెచ్‌సీ, ముత్యమాంబకాలనీ
- 17న వేపగుంట కమ్యూనిటీ హాల్ ప్రాంగణం
- 18న యూపీహెచ్‌సీ, పురుషోత్తపురం
- 20న యూపీహెచ్‌సీ, బుచ్చిరాజుపాలెం
- 25న యూపీహెచ్‌సీ పెందుర్తి
- 30న యూపీహెచ్‌సీ నరసింహనగర్

పర్యవేక్షణకు రెండు బృందాల ఏర్పాటు

విశాఖ విద్య: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ యం. మల్లయ్య నాయుడు శుక్రవారం సంబంధిత విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు రెండు బృందాలు ఏర్పాటు చేశారు. అక్టోబర్ 4 నుంచి 30 వరకు జోన్ పరిధిలో ఎనిమిది చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించడానికి యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశారు. వైద్య శిబిరాలను ప్రజానీకం సద్వినియోగం చేసుకునేలా మున్సిపల్, సచివాలయ, వైద్య ఆరోగ్యశాఖల సిబ్బంది కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలను ఎదుర్కొంటున్న వారి వివరాలను ముందుగానే నమోదు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి ఆ ప్రాంతంలో ఎప్పుడు వైద్య శిబిరం నిర్వహిస్తారో చెప్పడంతో పాటు టోకెట్ అందిస్తున్నారు. జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం ఏఎంవో డాక్టర్ జి. కృష్ణంరాజు శుక్రవారం పలు వార్డుల్లో పర్యటించి వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జోరుగా సాగుతోంది. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి సర్వే చేశారు. 61వ వార్డు మల్కాపురంలోని పల్లి వీధి, గొల్ల వీధి, గాంధీజీ వీధి తదితర ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి బీపీ, సుగర్, యూరిన్, రక్తహీనత సమస్య తదితర వైద్య పరీక్షలు చేశారు. మహిళలు రక్తహీనతతో, పురుషులు బీపీ సమస్యతో బాధపడుతున్న గుర్తించారు..

- 60వ వార్డులోని ఇందిరా కాలనీ, బర్మా కాలనీ, అశోక్‌నగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, సమస్యలతో బాధపడుతున్నవారు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.
- 59, 58 వార్డుల పరిధిలోని ప్రాంతాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటా సర్వే చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ చర్మ సమస్యలు, సుగర్, బీపీ వంటి వాటితో కొందరు స్థానికులు బాధపడుతున్నారని సిబ్బంది తెలిపారు.

సింహగిరిపై ఆర్జిత సేవలు పునః ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల సందర్భంగా ఈ నెల 24 నుంచి 28 వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసిన విషయం తెలిసిందే. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శుక్రవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడ వాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

- ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకాన్ని అలవాటుగా మార్చుకోవాలని గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ అన్నారు. బాలాజీ పాఠశాలలో ట్రాఫిక్ నియమాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. తల్లిదండ్రుల వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ పెట్టు కోవాలని విద్యార్థులు చెప్పాలని సూచించారు. కుడి వైపు నుంచే ఓవర్ టేక్ చేయాలన్నారు. బస్సు నుంచి దిగేవారు అదే బస్సు ముందు నుంచి వెళ్లరాదని.. అలా వెళితే ప్రమాదానికి గురవుతారన్నారు. మైనర్లు వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, ట్రాఫిక్ ఇబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మధు పూర్ణిమ



బుద్ధుని విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న సభ్యులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని ఉపాలి బుద్ధ విహార్ వద్ద మధు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భాద్రపద పౌర్ణమి పురస్కరించుకుని ముందుగా గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి అనంతరం బుద్ధ వందనం చేసి తేనె సమర్పించారు. బుద్ధ విహార్ నిర్వాహకులు మాట్లాడుతూ బాద్రపద పౌర్ణమిని మధుర పౌర్ణమి అని కూడా అంటారని, బౌద్ధ ఉపాసకులు భిక్షువులకు ఈ పౌర్ణమి రోజున తేనెను సమర్పించుకుంటారని వివరించారు. కార్యక్రమంలో పెయ్యల సిద్ధార్థ, భీమారావు, పోలారావు, చలం, గౌతం, వెంకట లక్ష్మి, సునీత, సమత తదితరులు పాల్గొన్నారు.